# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ పీఎం కిసాన్ 17వ విడత నిధులను ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసారు.

❖ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 21, 22వ తేదీల్లో జరగనున్నాయి.

❖ ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మనసులోని మాట మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం కిసాన్ 17వ విడత నిధుల్ని వారణాసిలో "కిసాన్ సమ్మేళన్"లో ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసారు. ఈ పథకం ద్వారా మొత్తం 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ కానున్నాయి. అలాగే పారా ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేసేందుకు శిక్షణ పొందిన 30 వేల మందికిపైగా స్వయం సహాయ బృందాల మహిళలకు సర్టిఫికెట్లను ప్రధాని మోదీ పంపిణీ చేశారు. దేశ వ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు, లక్షకు పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల ఉమ్మడి సేవా కేంద్రాలతో సహా 2.5 కోట్ల మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 21, 22వ తేదీల్లో జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఇటీవల ఎన్నికయిన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటూ, శాసనసభ సభపతి, ఉపసభాపతి, చీఫ్ విప్ లను ఎన్నుకోనున్నారు. ఎన్నికైన వారిలో సీనియారిటీ పరంగా బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. విజయవాడలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఈరోజు విడుదల చేసిన ఈ ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సాధారణ విభాగంలో 87 శాతం, ఒకేషనల్‌లో 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అధికారులు వెల్లడించారు. గత నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు ఒక లక్షా 37 వేల 887 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 26వ తేదీన విడుదల అవుతాయని అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మనసులోని మాట మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గొవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రేషన్ సరకుల సరఫరాలో అక్రమాలకు తావు లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పౌరసరఫరాల శాఖకు సంబంధించి స్టాక్ పాయింట్ పరిశీలించడం జరిగిందని, తూకంలో పంచదార, కందిపప్పు, పామాయిల్ ప్యాకెట్లలో 50 నుంచి 80 గ్రాముల వరకు స్పష్టంగా తేడా కనిపించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 253 మండల లెవెల్ స్టాక్ పాయింట్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు పంపిణీ చేసే నిత్యవసర వస్తువులను కల్తీ చేసినా, తూకంలో తేడాలు ఉండేటట్లు అక్రమ చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, శాఖ పరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నరసాపురం పార్లమెంట్ సభ్యులు భూపతిరాజు శ్రీనివాసవర్మ ఈరోజు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయమంత్రిగా ఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకువెళ్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమన్వయం చేసుకుంటూ, ఆంధ్రప్రదేశ్ కు పరిశ్రమలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సోమువీర్రాజు పలువురు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ రేపు వెలగపూడి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయం కోసం కేటాయించిన విజయవాడలోని నీటిపారుదలశాఖ అతిథిగృహాన్ని ఈరోజు ఆయన పరిశీలించారు. అనంతరం వెలగపూడి సచివాలయానికి బయలుదేరిన పవన్ కళ్యాణ్‌కు అమరావతి రాజధాని ప్రాంత రైతులు ఘన స్వాగతం పలికారు. సచివాలయం చేరుకున్న ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ కూడా ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సంపూర్ణ సహకారాన్ని అందించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడులు పిలుపు నిచ్చారు. ఈరోజు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పనిచేసి శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న టీడీపీ పార్టీ మంత్రిగా క్యాబినెట్ లో వుంటూ, రాష్ట్రానికి జిల్లాకు కావలసిన నిధులు తీసుకొస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు కావలసిన విత్తనాలు ఎరువులు, పురుగుమందులు సక్రమంగా సరఫరా చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అధికారులను కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతుండటంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)పై సుప్రీం కోర్టు అసహనం తెలిపింది. పరీక్ష నిర్వహిస్తున్న సంస్థగా న్యాయంగా వ్యవహరించాలని ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా.. దాన్ని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది. గత మే నెలలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈరోజు విచారణ జరిపింది. ఎన్టీఏ నుంచి సకాలంలో చర్యలు ఆశిస్తున్నామన్న ధర్మాసనం తదుపరి విచారణను జులై 8న చేపడతామని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం కిసాన్ పథకం 17వ విడతగా పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష 13 వేల 865 మంది రైతుల ఖాతాల్లో 22.77 కోట్ల రూపాయల నిధులు జమ అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుల ఖాతాల్లో నగదు జమయ్యాయని తూర్పుగోదావరి జిల్లా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలను పండించుకునేందుకు, పెట్టుబడి సాయం క్రింద పిఎం కిసాన్ తమకు ఎంతగానో దోహదపడుతోందని రైతులు ఆకాశవాణికి తెలిపారు. పిఎం కిసాన్ కింద నిధులను అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తూర్పుగోదావరి జిల్లా రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తూ....

(వాయిస్ 25 సెకన్లు) తూ.గో

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం నుంచి పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు, ఒడిషా రాష్ట్రాన్ని అనుసంధానించే అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న "పారాది" వంతెనను వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పంచాయితీరాజ్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, గ్రామీణ నీటి సరఫరా, గృహనిర్మాణం తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులతో విజయనగరం జిల్లా పరిషత్ అతిథిగృహంలో మంత్రి శ్రీనివాస్ ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి, నీటి లభ్యత గురించి నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =